క్లుప్తంగా

దేవరపల్లి ఈఓపీఆర్ఆర్‌డీగా ప్రభాకరరావు



ప్రభాకరరావును అభినందిస్తున్న గ్రామ సచివాలయ కార్యదర్శులు

దేవరపల్లి: మండల ఈఓపీఆర్ఆర్‌డీగా పి.ప్రభాకరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. కృష్ణాజిల్లా నందివాడ మండల కుదరవల్లి గ్రామ పంచాయతీ క్లస్టర్ కార్యదర్శిగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు ఈఓపీఆర్ఆర్‌డీగా బదిలీపై వచ్చారు. ప్రభాకరరావును దేవరపల్లి పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్, పలువురు గ్రామ సచివాలయాల కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఓటర్ల జాబితా సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజరాజేశ్వరి

పెరవలి: ఎన్నికల నియమావళి ప్రకారం గ్రామాల్లో సర్వే పూర్తి చేసి, ఓటర్ల జాబితా సిద్ధం చేసినట్టు తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వివిధ పార్టీ నాయకులతో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓట్ల పరిశీలన సమయంలో ఎటువంటి తేడాలు లేకుండా చూసుకోవాలని అన్ని పార్టీల నాయకులు పాల్గొనేందుకు అవకాశం కల్పించామన్నారు. ఎన్నికల సమయంలో బాధ్యతాయుతంగా పార్టీల నాయకులు ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీఎస్పీ, కమ్యూనిస్టులు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

చాగల్లు: బాలింతలు, గర్భిణులు ఆరోగ్య సంరక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా స్వీకరించాలని ఎంపీపీ మట్టా వీరాస్వామి అన్నారు. జాతీయ పోషకాహార మహోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గురువారం చాగల్లులో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఎంపీటీసీ ఎస్.అర్జునరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దాత సాయంతో షెడ్డు నిర్మాణం



రేకుల షెడ్డు ఇదే..

పెరవలి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండో ద్వారకా తిరుమలగా పేరు పొందిన అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయం ముందు దాతల సహకారంతో రేకుల షెడ్డు నిర్మించినట్టు ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ఈ షెడ్డును దాత రావులపాలెంకు చెందిన గొలుగూరి సత్యనారాయణ శ్రీమతి బృంద దంపతులు ఆర్థిక సహాయం అందించారన్నారు. ఆలయంలో మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాగల్లు: మల్లవరం సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నిడదవోలు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మల్లవరం, చంద్రవరం, గౌరిపల్లి, మార్కొండపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

పాఠశాలల పరిశీలన



తాళ్లపూడిలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈవో రామన్నదొర

తాళ్లపూడి: పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించడానికి ఇప్పటి నుంచే కష్టపడి చదవాలని కొయ్యలగూడెం డీవైఈవో రామన్నదొర అన్నారు. మండలంలోని పలు పాఠశాలలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తాళ్లపూడిలోని మాంటిస్సోరీ హైస్కూల్, శ్రీ విజేత హైస్కూల్‌లను పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాంటిస్సోరీ హైస్కూల్ కరస్పాండెంట్ వీవీ అనీష్, విజేత హైస్కూల్ హెచ్‌ఎం జేవీ ప్రమోద్‌కుమార్ తదితరులున్నారు.

ప్రజలను మోసగించేందుకు ప్రతిపక్షాల యత్నం

- హోం మంత్రి తానేటి వనిత
- కొత్త పింఛన్ల పంపిణీ



తాళ్లపూడిలో పింఛన్లు అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

తాళ్లపూడి: ఎన్నికల వేళ అధికార దాహంతో ఒక్కటవుతున్న ప్రతిపక్ష పార్టీలను నమ్మవద్దని హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. తాళ్లపూడిలోని సొలస దమయంతి కల్యాణ మండపంలో గురువారం మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో హోం మంత్రి తానేటి వనిత పాల్గొన్నారు. గ్రామాల వారీగా పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ టీడీపీ, జనసేన కలిసి పోటీ చేసేందుకు ప్రజలను మోసగించేందుకు వస్తున్నాయని వారిని నమ్మవద్దన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాజకీయాలు చూడకుండా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. గతంలో జన్మ భూమి కమిటీల పెత్తనం ఉండేదని, ఇప్పుడు ప్రతి పథకం ఇంటి వద్దకే వస్తోందని అన్నారు. అందరం కలిసి వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ గెలుపించుకుందామన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీవైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, తాళ్లపూడి సర్పంచ్ నాక్కా అనురాధ, మండల పార్టీ గౌరవాధ్యక్షుడు సిద్దంశెట్టి కృష్ణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కొమ్మిరెడ్డి పరశురామారావు, ఎలిపే సుధారాణి, గండి రాంబాబు, ఎల్లిన శివ, యాళ్ల స్వప్న, మహిళా అధ్యక్షురాలు దమయంతి, నాయకులు పాల్గొన్నారు.



నల్లజర్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు



అట్లపాడులో పింఛన్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు

అర్హతే ప్రామాణికం.. ఇంటికే పథకం

నల్లజర్ల: అర్హతే ప్రామాణికంగా సామాజిక భద్రత కల్పిస్తూ ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేసి ప్రజల జీవితాలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గురువారం నల్లజర్ల సచివాలయం వద్ద ఎంపీడీఓ రాజశేఖర్ అధ్యక్షతన మండలానికి మంజూరైన 728 కొత్త పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల బతుకులలో వెలుగులు నింపుతున్న వివిధ పథకాలను ప్రభుత్వం నిబద్ధతతో అమలు చేస్తోందన్నారు. అర్హతే ప్రామాణికంగా పేదరికమే కొలమానంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జాతీయ స్థాయిలో అందరిని ఆకట్టుకుంటున్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ప్రతిపక్షాలు వేలెత్తి చూపలేని పరిస్థితి ఉందంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంత చిత్తశుద్ధితో పాలన చేస్తున్నారో తేటతెల్లం అవుతుందన్నారు. మళ్లీ మరోసారి జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంక జయలక్ష్మి, వైస్ ఎంపీపీలు అచ్యుత శివాజీ, ఆరుగొల్లు మణి, జెడ్పీటీసీ ముప్పిడిలక్ష్మి, ఎంపీటీసీలు మేణ్ని వెంకటలక్ష్మి, యడ్లపల్లి మార్త, సర్పంచ్ పల్లి జ్యోతి, ఉపసర్పంచ్ రాయుడు విజయకుమార్, మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, పెండ్యాల హరేరామకృష్ణ, నాయకులు వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, బంక అప్పారావు, పంది సత్యనారాయణ, చేబ్రోలు బాలాజీ, యడ్లపల్లి మంగరాజు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

నిడదవోలు రూరల్: మండలంలోని అట్లపాడు గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు నూతన పింఛన్లు అందజేశారు. విజ్జేశ్వరంలో సర్పంచ్ తిక్కా శ్రీనివాస్, కంసాలిపాలెంలో సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు మలిశెట్టి వరప్రసాద్, కాటకోటేశ్వరంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుంటుపల్లి రామచంద్రరావు, కోసూరి అప్పారావులు లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస వేతనం కల్పించాలి

- డ్వామా పీడీ జగదాంబ
- ఉపాధి పనులపై ప్రజావేదిక



ప్రజా వేదికలో పాల్గొన్న డ్వామా పీడీ జగదాంబ

దేవరపల్లి: ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.272 వచ్చేటట్టు పనులు చేపట్టాలని డ్వామా పీడీ పి.జగదాంబ క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. 2022 ఏప్రిల్ 01 నుంచి 2023 మార్చి 31 వరకు దేవరపల్లి మండలంలో జరిగిన ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సదస్సులో డ్వామా పీడీ పాల్గొని అధికారులతో సమీక్షించారు. గ్రామాల వారీగా నివేదికను తనిఖీ సిబ్బంది చదివి వినిపించారు. తనిఖీలో మండలంలో రూ.2 వేలు రికవరీ చేసినట్టు ఆమె తెలిపారు. పనుల్లో ఎక్కడా ఎటువంటి అవకతవకలు జరగలేదని, ఒకటి, రెండు గ్రామాల్లో చిన్నచిన్న పొరపాట్లు జరగ్గా క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి రికవరీ చేసినట్టు ఆమె తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో రూ.6 కోట్ల విలువ గల 261 పనులు చేసినట్టు ఆమె తెలిపారు. దీనిలో రూ.3 కోట్లు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ పనులు ఉన్నట్టు ఆమె తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కూలీలకు వెంటనే పనులు కల్పించాలని, పనులకు రాని కూలీలను గుర్తించి పనులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 600 మంది కూలీలు పని చేస్తున్నారని, వేసవిలో సగటున రోజుకు 3 వేల మంది కూలీలు పని చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఈ సదస్సులో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎస్ఆర్పీలు, డీఆర్పీలు, క్షేత్రస్థాయి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



తాళ్లపూడి ఉప సర్పంచ్‌ను పార్టీలోకి వస్తున్న హోం మంత్రి వనిత

తాళ్లపూడి: గ్రామంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఇటీవల తాళ్లపూడి ఉప సర్పంచ్‌గా ఎన్నికైన అప్పన జగదీష్ హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీని వీడి వచ్చిన ఆయనకు మంత్రి వనిత పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. నాయకులతో కలిసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, పార్టీ గౌరవాధ్యక్షుడు సిద్దంశెట్టి కృష్ణ, నాయకులు నాక్కా చిట్టి బాబు, తోట రామకృష్ణ, సర్పంచ్‌లు నక్కా అనురాధ, కొమ్మిరెడ్డి పరశురామారావు తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలగా సంఘం నాయకులు

చాగల్లు: స్థానిక తెలగా సంఘం ఆధ్వర్యంలో ఆలయం వద్ద ఈ నెల 18వ తేదీ నుంచి 26వ తేదీ వరకు గణేశ్ నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి గణపతి నవరాత్రి మహోత్సవాల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది 68వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఏర్పాట్లను ప్రతి ఏటా లాగే ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా చేస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ 22న ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎంపీ మార్గాని భరత్‌రామ్, నిడదవోలు శాసనసభ్యులు జి.శ్రీనివాస నాయుడు, సినీ దర్శకులు వీవీ వినాయక్, వర్ధమాన నటి అనసూయకు ఆత్మీయ సత్కారం కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల శాఖ గౌరవాధ్యక్షులు జుట్టా కొండలరావు, పిండి మంగరాజు,ఇంటి వీర్రాజు, శ్రీరంగం అన్నవరం, నాగిరెడ్డి శేషు, నాగేశ్వరరావు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టును స్వాగతిస్తున్నాం



గోపాలపురంలో మాట్లాడుతున్న మంగరాజు

గోపాలపురం: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టును స్వాగతిస్తున్నామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. గురువారం ఆయన గోపాలపురం వచ్చిన సందర్భంగా సాక్షితో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు అరెస్టును స్వాగతిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎస్సీలు అంతా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం వైపు వెళుతున్న సమయంలో చంద్రబాబు మంద కృష్ణమాదిగకు ఆర్థికంగా సహాయం చేసి వర్గీకరణకు ద్రోహం చేసిన వ్యక్తి అని అన్నారు. చంద్రబాబు అవినీతి కేసులో ఉంటే మందకృష్ణ మాదిగ చంద్రబాబు ప్యాకేజీ కోసం వెంపర్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఏపీలో ఎంతో మంది తెలివైన న్యాయవాదులు ఉండగా రోజుకు రూ.కోటి 50 లక్షలు వెచ్చించి ఢిల్లీ నుంచి ఖరీదైన న్యాయవాదులను ఎందుకు తీసుకొచ్చారని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబుకు మద్దతు తెలియజేస్తున్న ప్రతి ఒక్కరూ ప్యాకేజీ కోసం తప్ప చంద్రబాబుపై ప్రేమకాదని మంగరాజు పేర్కొన్నారు. చంద్రబాబు, నారా లోకేష్, పవన్‌కల్యాణ్, కమ్యూనిస్టులు, ఎల్లో మీడియా ఎన్ని అ సత్య ప్రకటనలు చేసినా 2024లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని అన్నారు.

పిల్లలందరూ తప్పకుండా చదువుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం రూరల్: పిల్లలందరూ తప్పకుండా చదువుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి విద్యకు దూరం చేయరాదని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. గురువారం కాతేరు గ్రామ సచివాలయంలో జిల్లా సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో ఉచిత మరియు నిర్బంధ విద్యాహక్కుచట్టం 2009, ఏడీఆర్, మీడియేషన్ ప్రక్రియల ద్వారా న్యాయ సమస్యల పరిష్కారం అనే అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యూషకుమారి మాట్లాడుతూ 6 ఏళ్ల నుంచి 14 ఏళ్ల పిల్లలు తప్పనిసరిగా చదువుకోవాలన్నారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు, అఘాయిత్యాలకు గురవుతున్న పిల్లలు కనిపిస్తే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ లేదా ఇతర సంబంధిత అధికారులకు తెలియజేయడం ప్రజల బాధ్యత అని తెలిపారు. ఆస్తి వివాదాలు, కుటుంబ వివాదాలు, రాజీ పడదగిన అన్ని న్యాయ సమస్యలను ఏడీఆర్, మీడియేషన్ ప్రక్రియల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రకాశం నగర్: అర్బన్ నియోజకవర్గస్థాయి ఆటల పోటీలు గురువారం స్థానిక ఎస్‌కేవీటీ హైస్కూల్లో ప్రారంభమయ్యాయి. అర్బన్ రేంజ్ డీఐ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ ఈ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్కేవీటీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ ఏవీడీ ప్రసాదరావు పాల్గొన్నారు.

ఐ.పంగిడిలో హిందీ దివస్



గ్రామంలో హిందీ అక్షర ఆకృతిలో కూర్చోన్న విద్యార్థులు

కొవ్వూరు: హిందీ దివస్ కార్యక్రమాన్ని ఐ.పంగిడి జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు గురువారం ఘనంగా నిర్వహించారు. హిందీ అక్షర రూపంలో కూర్చోని విద్యార్థులు మానవ హారంగా ఏర్పడ్డారు. హెచ్‌ఎం ఎంఎస్ఎస్‌వీ రామారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పెయింటింగ్, వ్యాస రచన, హిందీ కవిత పఠనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు శిరీష, రవికుమార్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

నల్లజర్ల: జగన్నాథపురానికి చెందిన పులి వెంకటలక్ష్మి మనవడు శ్రీమంత్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం జనసేన పార్టీ రూ.20 వేలు ఆర్థ/ క సాయం చేసినట్టు మండల అధ్యక్షుడు చోడసాని బాపిరాజు తెలిపారు. 14ఏళ్ల శ్రీమంత్‌కు ఇటీవల జ్వరం వచ్చి మెదడుకు ఇన్‌ఫెక్షన్ సోకడంతో విజయవాడ రేయిన్‌బో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేసినట్టు చెప్పారు.

అందుబాటులో ఓటర్ల జాబితా

గోపాలపురం: నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఓటర్ల జాబితా ఆయా బూత్ లెవెల్ అధికారుల వద్ద అందుబాటులో ఉందని ఓటు నమోదు అధికారి టీవీకే రాజు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓట్ల తొలగింపుపై అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వినాయక చవితికి మట్టి విగ్రహాలు రెడీ



మట్టి విగ్రహాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయిని

గోపాలపురం: వినాయక చవితి సందర్భంగా రంగుల విగ్రహాలు ఏర్పాటు చేయడం వల్ల కాలుష్యం పెరిగిపోతుందని తద్వారా ప్రజలు అనేక రోగాలబారిన పడుతున్నారని, అందరూ మట్టి విగ్రహాలకే పూజలు చేయాలని విద్యార్థులకు వెదుళ్లకుంట పాఠశాల హెచ్‌ఎం గుంజే భవ్యశ్రీ అవగాహన కల్పించారు. వినాయక చవితికి ప్రతి ఇంటిలోనూ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీఆర్‌పీ కొయ్య నాగరాజు పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆకట్టుకున్న వస్త్ర ప్రదర్శన



వస్త్రాలను పరిశీలిస్తున్న మహిళలు

ప్రకాశం నగర్: జేఎన్ రోడ్డులోని జేకే గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ప్రదర్శన, విక్రయాలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశం నలుమూలల నుంచి ప్రఖ్యాత గాంచిన సుమారు 50కి పైగా డిజైన్ వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి ప్రముఖ వస్త్రాలను తీసుకుని వచ్చి నగర ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రదర్శన 16వ తేదీ రాత్రి వరకు ఉంటుందన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన ‘తొమ్మండ్రు’



ఎమ్మెల్యే తలారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేష్

దేవరపల్లి: ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులుగా నల్లజర్ల మండలం దూబచర్లకు చెందిన తొమ్మండ్రు రమేష్ గురువారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును మర్యాద పూర్వకంగా కలిశారు. దేవరపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకట్రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. రమేష్‌ను ఎమ్మెల్యే అభినందించారు. పుణ్యక్షేత్రం అభివృద్ధికి సహకరించాలని ఆయన తెలిపారు. వేంకటేశ్వరస్వామి వారికి సేవ చేసుకోవడానికి అవకాశం కల్పించిన దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర హోం శాఖా మంత్రి తానేటి వనిత, గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ)కి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

పామాయిల్ కోత కార్మికులకు మరింత భద్రత

నల్లజర్ల: పామాయిల్ కోత కార్మికుల భద్రత కోసం మరిన్ని ఆధునిక పరికరాలు అందించనున్నట్టు 3 ఎఫ్ ఆయిల్ పామ్ సంస్థ జీఎం పి.విజయప్రసాద్ వెల్లడించారు. గురువారం నల్లజర్లలో దాదాపు 750 మంది కోత కార్మికులతో 3ఎఫ్ పామాయిల్ సంస్థ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయప్రసాద్ మాట్లాడుతూ కార్మిక సంఘ నాయకులతో కమిటీ ఏర్పాటు చేసి కార్మికుల భద్రత గురించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పామాయిల్‌తో తమ ప్రాంతానికి అభివృద్ధిని రైతులు గద్దే విజయరామ్మోహరావు, బళ్ల ప్రభాకరావు(నాని) వివరించారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్లు నవీన్, విశాల్, శాస్త్రవేత్త సునీత, హెచ్‌ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: స్థానిక 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు నిడదవోలు డీఈ డి.వీరభద్రరావు తెలిపారు.

మహిళ అదృశ్యం

నిడదవోలు రూరల్: కంసాలిపాలెం గ్రామానికి చెందిన మహిళ కారింకి లక్ష్మి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం షేక్ సుభానీ గురువారం తెలిపారు. కారింకి లక్ష్మి ఈనెల 13వ తేదీన నిడదవోలు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదని, స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికిన కనిపించకపోవడంతో కుమారుడు వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

మోటారుసైకిల్ చోరీ

కొవ్వూరు: గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన జి.శ్రీనివాసరావు అనే వ్యక్తి ఈనెల ఎనిమిదో తేదీన పని నిమిత్తం కొవ్వూరు వచ్చి తిరిగి వెళ్లే సమయంలో గోష్పాదక్షేత్రానికి వెళ్లారు. బైక్‌ను అక్కడే ఆలయ ప్రాంగణంలో పార్కింగ్ చేశాడు. తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీనిపై గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు.

సారా బట్టీలపై దాడి



స్వాధీనం చేసుకున్న సామగ్రి, అరెస్టు చేసిన నిందితుడితో పోలీసులు

గోపాలపురం: కరగపాడు పంచాయతీ కరగపాడు, బుచ్చియ్యపాలెం గ్రామాల్లోని సారా బట్టీలపై దాడి నిర్వహించినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ డి.సుధ గురువారం తెలిపారు. ఈ దాడుల్లో 3వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల సారాతో ఐదుగురిని అరెస్టు చేసినట్టు తెలిపారు. కరగపాడు, బుచ్చియ్యపాలెం గ్రామాలకు చెందిన బొమ్మిన లక్ష్మణరావు, బొమ్మిన అయ్యప్ప, పంది లక్ష్మణరావు, పులిబోయిన నాగరాజు, బొమ్మిన భాస్కరరావులను అరెస్టుచేశామని సీఐ తెలిపారు.